సాక్షి
సిద్దిపేట

శనివారం | 3 | ఆగస్టు | 2024



పేద కుటుంబానికి పెద్ద ఆపద

విధి ఆడిన వింత నాటకంలో ఓ పేద బార్బర్ కుటుంబం చిన్నాభిన్నమైంది. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి పుట్టెడు కష్టం వచ్చింది. వివరాలు 8లో ▸



ఫామ్‌హౌస్ అడ్డాగా పేకాట

పేకాట శిబిరంపై ములుగు పోలీసులు దాడి చేశారు. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన 9 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. వివరాలు 8లో ▸



అభివృద్ధి చేసి.. అప్పుల పాలై

బిల్లులు తక్షణం చెల్లించాలంటూ మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఆర్థికాభివృద్ధికే మహిళా శక్తి పథకం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మహిళల ఆర్థిక అభివృద్ధి కోసమే ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందని పశు సంవర్ధక శాఖ జిల్లా అదనపు డైరెక్టర్ రమేశ్ అన్నారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో మహిళా శక్తి కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి ద్వారా మహిళలకు ఆవులు, గేదెలను అందించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు వేల యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. జగదేవ్‌పూర్ మండలానికి 150 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఏపీడీ మధుసూదన్, డీపీఎం వాసుదేవ్, పశు వైద్యాధికారి శ్వేత, ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది బాబు, నాగరాజు, మహిళలు పాల్గొన్నారు.

జేసీబీ, టిప్పర్ సీజ్

రాయపోలు(దుబ్బాక): అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేజీసీబీతో పాటు టిప్పర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రాయపోలు ఎస్‌హెచ్‌ఓ కృష్ణంరాజు తెలిపిన వివరాల మేరకు.. అంకిరెడ్డిపల్లి శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా శుక్రవారం మట్టిని టిప్పర్‌లో తరలిస్తున్నారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు దాడి చేసి జేసీబీ, టిప్పర్‌లను స్వాధీనం చేసుకుని రాయపోలు పోలీసులకు అప్పగించారు. డ్రైవర్లు కెదావత్ సురేందర్, అంకగాళ్ల నర్సింలులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్



పీజీ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, పీడీఎస్‌యూ బాధ్యులు

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట పీజీ కళాశాల హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగుతున్న పీజీ కళాశాల హాస్టల్ విద్యార్థులకు భోజనాన్ని అందించకపోవడం సిగ్గుచేటన్నారు. సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం విద్యార్థులతో కలిసి కళాశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్స్‌లో విద్యార్థులకు గదులను కేటాయించి భోజన వసతి కల్పించాలన్నారు. వెంటనే ఓయూ వీసీ కళాశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో అధికారులు స్పందించని పక్షంలో యూనివర్సిటీ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు విజయ్‌కుమార్, కృపాకర్, గోపాల్, వేణు, రమేశ్, సందీప్, నిరంజన్, నవీన్, అనీల్, నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసుల అదుపులో ఆటో, ఇద్దరు నిందితులు

చేర్యాల(సిద్దిపేట): ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 10.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఆటోలో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆటోతో పాటు మహమ్మద్ హలీమ్, ఏర్పుల నరేష్ అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎక్కడైనా ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసినా, నిల్వ ఉంచిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేటజోన్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ప్రేరణ పాండ అన్నారు. శుక్రవారం కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. రోజూ వార్డుల్లో సిబ్బంది పర్యటించాలన్నారు. డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛ సిద్దిపేట దిశగా ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేయాలన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

గర్భంలోనే చావుకేక!



నంగునూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక గర్భం దాల్చింది. ఆ బాలికను ప్రేమించిన వ్యక్తి ఆర్‌ఎంపీ వద్దకు జూలై 10న తీసుకెళ్లి అబార్షన్ చేయించాడు. తీవ్ర రక్తస్రావమైంది. దీంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రాజగోపాల్ పేట పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం అబార్షన్ చేసిన ఆర్‌ఎంపీతో పాటు ల్యాబ్ టెక్నిషియన్‌ను 12న రిమాండ్‌కు తరలించారు. ఇలా ఒక్క నంగునూరులోనే కాదు.. జిల్లా అంతటా ప్రైవేట్ ఆస్పత్రుల్లో, గ్రామాల్లో ఆర్‌ఎంపీలు గుట్టుగా అబార్షన్లు చేస్తున్నారు. ఇంకా వెలుగుచూడని ఘటనలు ఎన్నో.. – సాక్షి, సిద్దిపేట

అడ్డగోలుగా స్కానింగ్‌లు

- గుట్టుగా లింగనిర్ధారణ
- ఇష్టారాజ్యంగా అబార్షన్లు
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో, ఆర్‌ఎంపీ కనుసన్నల్లోనే వ్యవహారం
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

పైసలిస్తే చాలు పుట్టబోయే బిడ్డ ఆడా మగా అని చెప్పేస్తున్నారు.. కాసులకు కక్కుర్తి పడి పలువురు వైద్యసిబ్బంది లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ ఆడపిల్ల అయితే కడుపులోనే చిదిమేస్తున్నారు. ప్రేమికులు, ఇతరులు శారీరకంగా కలవడం.. గర్భందాల్చడంతో పెరుగుతున్న పిండానికి చావుగంట మోగిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో, పల్లెల్లో ఆర్‌ఎంపీలు యథేచ్ఛగా చేస్తున్నారు. గతంలో సిద్దిపేట పట్టణంలో ఓ వైద్యురాలు నిర్వహిస్తున్న ఒక ఆస్పత్రిని వైద్యారోగ్య శాఖ సీజ్ చేయడంతో కొంతకాలం ఈ దందాకు అడ్డుకట్టపడింది. కొద్దిరోజులుగా ఈ దందా మళ్లీ కొనసాగుతోంది. వైద్యారోగ్య శాఖ పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా పలువురు వైద్యులు, ఆర్‌ఎంపీలు అబార్షన్లకు పాల్పడుతున్నారు.

నిబంధనలు గాలికి..

లింగనిర్ధారణ చేయవద్దన్న నిబంధనలను స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు తుంగలో తొక్కుతున్నారు. అధిక మొత్తంలో డబ్బులు ఇస్తే చాలు పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అనే విషయాన్ని చెబుతున్నారు. దీంతో తమకు పుట్టబోయే బిడ్డ ఆడపిల్ల అనే విషయాన్ని జీర్ణించుకోలేని కొందరు అబార్షన్ల వైపు మొగ్గు చూపుతున్నారని సమాచారం. మరి కొందరు ప్రేమికులు, ఇతర వివాహేతర సంబంధం ఉన్నవారు కడుపులో ఉన్న పిండాన్ని తీసేందుకు ఎంతటి డబ్బులకైనా వెనకడుగు వేయడం లేదు. ఇదే అదనుగా చేసుకుని పలు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు, ఆర్‌ఎంపీలు అధికంగా డబ్బులు తీసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆయా ఆస్పత్రులకు గర్భిణులను తీసుకువచ్చే విషయంలో వివిధ క్లినిక్‌లు, ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేసే నర్సులు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఒక్కో అబార్షన్‌కు సుమారు రూ 30వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

కానరాని తనిఖీలు

స్కానింగ్ కేంద్రాల్లో డెకాయి ఆపరేషన్ పేరిట వైద్యశాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలి. కానీ ఎక్కడా పని చేసిన దాఖలాలు లేవు. ప్రైవేటు ఆస్పత్రుల్లో, స్కానింగ్ సెంటర్లలో నిబంధనలు పాటించకపోయినా వైద్య శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు తనిఖీల సమాచారం కూడా ముందుగానే కేంద్రాల నిర్వాహకులకు తెలుస్తుండడంతో అక్రమార్కులు అంతా సర్దుకుంటున్నారు.

ఎప్పుడు చేస్తారంటే..

గర్భంలో శిశువు బుద్ధిమాంద్యం, తక్కువ బరువు, వివిధ రకాల రుగ్మతలతో ఉన్నప్పుడు, తల్లి ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు అబార్షన్ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సుశిక్షితులైన స్త్రీ వైద్య నిపుణులు మాత్రమే చేయాల్సి ఉంటుంది. మరోవైపు సదరు ఆస్పత్రికి మెడికల్ టర్మినేషన్ యాక్ట్ 1,1971 ప్రకారం లీగల్ రిజిస్ట్రేషన్ ఉండాలి. గర్భం దాల్చి 12 వారాలు అయిన తర్వాత గైనకాలజిస్టుతో పరీక్షలు చేయించుకుని తీవ్రమైన ఆరోగ్య సమస్య ఉన్నట్లు గుర్తిస్తే సదరు వైద్యుల అనుమతితో అబార్షన్ చేయవచ్చు. కానీ ఇవేవి తమకు పట్టవన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. తమను ఎవరు ఏమి చేస్తారులే అనే ధీమాతో జిల్లా పరిధిలో విచ్చలవిడిగా అబార్షన్ల దందా కొనసాగిస్తూ గర్భంలోనే చావుకేకను పుట్టిస్తున్నారు. ఇప్పటికైన వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.



చర్యలు తప్పవు

జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో, ఇతర క్లినిక్‌లలో అబార్షన్లు నిర్వహించినట్లు తేలితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఆపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే వాటిని సీజ్ చేస్తాం. వీటి పర్యవేక్షణ కోసం జిల్లాలో ప్రత్యేక నిఘా విభాగం ఏర్పాటు చేశాం. అబార్షన్ జరిగినట్లు నిర్ధారణ జరిగితే డిగ్రీ రద్దు కోసం ఎంసీఐకి ఫిర్యాదు చేస్తాం.

– శ్రీనివాస్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ

ధరల్లో తేడా రావొద్దు



రైతు బజార్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

- నిర్ణయించిన రేట్లకే విక్రయించాలి
- కలెక్టర్ మనుచౌదరి
- రైతుబజార్‌లో వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశం

సిద్దిపేటజోన్: రైతుబజార్‌లో ధరల పట్టికకు అనుగుణంగానే క్రయవిక్రయాలు జరగాలని, ఎలాంటి తేడా రావొద్దని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక రైతు బజార్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతులు, క్రయవిక్రయాలను పరిశీలించారు. పలువురు రైతులతో కలెక్టర్ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 400మంది రైతులు కూరగాయల విక్రయాలు చేస్తారని అధికారులు వివరించారు. అన్ని వసతులు ఉండేలా చూడాలని సంబంధించిన మార్కెటింగ్ అధికారి నాగరాజుకు సూచించారు.

ప్రత్యేక వెబ్ సైట్

సెట్విన్ కేంద్రంలో శిక్షణ పొందిన వారు తయారీ చేసిన వస్తువులు మార్కెటింగ్ చేసేందుకు ప్రత్యేకంగా వెబ్ సైట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సెట్విన్ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో కంప్యూటర్, ఆర్ట్ క్రాఫ్ట్, టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహిందీ డిజైన్, నోట్ బుక్స్ మేకింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. వారు తయారీ చేసిన వస్తువులు చూసి అభినందించారు. సెట్విన్‌లో శిక్షణ పొందిన వారు ప్రభుత్వ ఉద్యోగం పొందారని, మరికొందరు ప్రయివేటు ఉద్యోగాలు చేస్తున్నారని సెట్విన్ ఇన్‌చార్జి అమినా ఈ సందర్భంగా కలెక్టర్ కు వివరించారు. శిక్షణతో పాటు మార్కెటింగ్ చేసేలా చూస్తానని పేర్కొన్నారు.

‘స్వచ్ఛదనం- పచ్చదనం’ ఊరూరా చేపట్టండి

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో పంచాయతీ, వైద్యశాఖ, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో ఈనెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం- పచ్చదనం పేరిట పారిశుద్ధ్యం, వైద్యసేవలు, మంచి నీటి ట్యాంకులు క్లీనింగ్ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒక రోజు వనమహోత్సవ కార్యక్రమం చేపట్టి మొక్కలు నాటాలన్నారు. అన్ని కార్యక్రమాలలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ముందుకు సాగాలన్నారు. మండల, గ్రామాల ప్రత్యేక అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, డీపీఓ దేవకీదేవి, డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యా, ఫారెస్ట్ అధికారి శ్రీనివాస్, వైద్యాధికారి శ్రీనివాస్, ఎంపీడీఓలు, ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

గీత కార్మికుల హక్కులు సాధిద్దాం

కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రమణ



మాట్లాడుతున్న రమణ

కొమురవెల్లి(సిద్దిపేట): గీత కార్మికుల హక్కుల కోసం పోరాడుదామని, సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించాలని కల్లు గీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎంబీ రమణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో గీత కార్మికులతో కలిసి సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈనెల 2 తేదీ నుంచి 18 వతేదీ వరకు సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని గీత కార్మికులకు సూచించారు. అలాగే 50 ఏళ్లు దాటిన ప్రతి కార్మికుడికి పింఛన్ అందించాలని కోరారు. ప్రతి గ్రామంలో గీత కార్మికులకు కమ్యూనిటీ భవనంతో పాటు సర్వాయి పాపన్న విగ్రహాన్ని నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొహెడ కొమురయ్య, జిల్లా కార్యదర్శి అరుణ్, జనగామ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, తళ్లపల్లి రాజు, తురాయి నవీన్ గౌడ్,శిఖ నర్సింహులు గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నిర్ధారణ పరీక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సమగ్ర శిక్షా అభియాన్, అలింకో సంస్థల ఆధ్వర్యంలో దివ్యాంగుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీటీసీ భవనంలో పరీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి 18 ఏళ్ల లోపు 326 మంది దివ్యాంగులు హాజరయ్యారన్నారు. అర్హత కల్గిన దివ్యాంగులకు త్వరలోనే ఉపకరణ పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. గతేడాది జిల్లాలో 226 మంది దివ్యాంగులకు ఉపకరణ పరికరాలు అందించామన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి రంగనాథ్, వైద్యులు పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధికి సీఎం విశేష కృషి

గజ్వేల్: విద్యారంగాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని మల్కాజ్‌గిరి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఏకకాలంలో 30వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి చరిత్ర సృష్టించారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో విద్యారంగం నిర్వీర్యమైందని చెప్పారు. సమాజ ప్రగతి పాఠశాల గదిలోనే నిర్మించబడుతుందని గట్టిగా విశ్వసించే సీఎం చిత్తశుద్ధితో చర్యలు చేపడుతున్నారని అన్నారు. ఉపాధ్యాయులు తమ విధులను అంకిత భావంతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మెదక్, నర్సాపూర్, దుబ్బాక కాంగ్రెస్ నేతలు ఆంజనేయులు, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన నల్ల శ్రీధర్ కుటుంబీకులను మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, నర్సారెడ్డిలు పరామర్శించారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

చేర్యాల(సిద్దిపేట): ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపారాణి పిలుపునిచ్చారు. శుక్రవారం వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డితో కలిసి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెట్లు ప్రాణ వాయువుని అందిస్తాయని, మొక్కల రక్షణ అందరి బాధ్యత అన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, ఆర్పీలు, సిబ్బంది, పట్టణ మహిళలు పాల్గొన్నారు.

నాచారం.. ఇదేం గ్రహచారం

నాచారం గుట్ట రైల్వేస్టేషన్ చూసి ప్రయాణికులు జడుసుకుంటున్నారు. తలుపులు, కిటికీలు, టాయిలెట్ బ్లాకులు, కౌంటర్ గది, ఒకటేమిటి దాదాపు అన్ని ధ్వంసమైన తీరు చూసి హడలిపోతున్నారు. వీటికి అదనంగా ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, కూలిన ప్రహరీలు రైల్వే ప్రయాణికులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. స్టేషన్‌కే రక్షణ లేని చోట ప్రయాణికుల పరిస్థితి ఏమిటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్టేషన్‌కు సరైన రోడ్డు కూడా లేకపోవడంతో ‘చెంతనే స్టేషన్ ఉన్న ప్రయాణికుల ఆదరణ సున్న’ అన్నట్లు వర్గల్ మండలం నాచారం గుట్ట రైల్వేస్టేషన్ పరిస్థితి మారింది.

– వర్గల్(గజ్వేల్)

- గుబులు పుట్టిస్తున్న రైల్వేస్టేషన్
- చీకటిపడితే అసాంఘిక శక్తుల అడ్డా
- తలుపులు ధ్వంసం, కూలిన ప్రహరీలు
- అడుగడుగునా పిచ్చిమొక్కలు
- ఆదరణకు నోచక దైన్యం



పిచ్చిమొక్కలు, పొదలతో నాచారం రైల్వేస్టేషన్

రైల్వే ఆస్తులకు రక్షణ కరువైంది. నాలుగేళ్ల క్రితం కోట్లాది రూపాయలు వెచ్చించి మనోహరాబాద్-సిద్దిపేట రైలు మార్గంలో రెండోయాదాద్రిగా పేరొందిన నాచారం గుట్ట లక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రం చేరువలో ‘నాచారం’ రైల్వే స్టేషన్ నిర్మించారు. దాదాపు 465 చదరపు మీటర్ల విస్తీర్ణంలో స్టేషన్‌మాస్టర్ గది, రిలే రూం, తదితర ఎక్విప్‌మెంట్ గదులు నిర్మించారు. సర్వాంగులతో రైల్వేస్టేషన్ భవన సముదాయం నిర్మించి విద్యుదీకరణ చేశారు. ప్రయాణికులను ఆకట్టుకునేలా ప్లాట్‌ఫారం పొడవునా ప్రహరీలను బొమ్మలతో తీర్చిదిద్దారు. అసాంఘిక శక్తుల ఆగడాలతో ఇవన్నీ గతం అన్నట్లుగా మారింది.

చీకటి పడితే అంధకారమే..

స్టేషన్ పరిసరాలన్నీ పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు, పుట్టలతో నిండిపోయాయి. పలుచోట్ల ప్రహరీలు కూలిపోయాయి. వీటికి తోడు స్టేషన్ వద్ద వెలగని లైట్లతో చీకటిపడితే అంధకారం అలుముకుంటుంది. అసాంఘిక శక్తులు, మందుబాబుల అడ్డాగా మారుతుంది. టికెట్ ఇచ్చేందుకు ఇక్కడ స్టేషన్‌మాస్టర్ కూడా లేడు.

ఆదరణ శూన్యం


నాచారం గుట్ట పుణ్యక్షేత్రానికి కూతవేటు దూరంలో హల్దీవాగు ఆవలి ఒడ్డున రైల్వేస్టేషన్ ఉంది. ఇక్కడికి నేరుగా రోడ్డు సౌకర్యం లేదు. నాచారం గ్రామం మీదుగా వెంకటాయపల్లి రోడ్డు మార్గంలో 2.5 కిలోమీటర్లు చుట్టు తిరిగి స్టేషన్‌కు చేరుకోవాలి. కయ్యలు, భారీ గండ్లతో రోడ్డు ప్రయాణానికి అనువుగా లేదు. స్టేషన్ నుంచి గుడికి చేరేందుకు ప్రైవేటు వాహనాలు లాంటి రవాణా సదుపాయం లేదు. దీంతో నాచారం యాత్రికులు, పరిసర గ్రామాల ప్రజలు గతుకుల మార్గంలో స్టేషన్‌కు వెళ్లకుండా, ఆర్టీసీ వైపే మొగ్గుచూపుతున్నారు. రైల్వేశాఖ స్పందించి పర్యవేక్షణతోపాటు, ప్రయాణికులకు భద్రత కల్పించే చర్యలు చేపట్టి, సౌకర్యాలు మెరుగుపరిస్తేనే నాచారం రైల్వేస్టేషన్ ఏర్పాటు లక్ష్యం సిద్ధిస్తుంది.



రక్షణ కొరవడి.. అసాంఘిక శక్తులు తెగబడి

రూ. కోట్ల వ్యయంతో నిర్మించిన రైల్వేస్టేషన్‌కు రక్షణ కొరవడింది. ఊరికి దూరంగా పర్యవేక్షణలేని చోట ఉన్న స్టేషన్‌ను దొంగలు, అసాంఘిక శక్తులు టార్గెట్ చేశారు. గదులలోకి చొరబడి విధ్వంసం సృష్టించారు. కిటికీలు ధ్వంసం చేశారు. స్విచ్‌బోర్డులు, ఫ్యాన్లు, ట్యూబులైట్లు, తలుపులు ఊడదీసి అపహరించుకుపోయారు. టికెటింగ్ కౌంటర్, ఫర్నిచర్ ఎత్తుకెళ్లారు. పరికరాలను, టాయిలెట్ కుండీలను పగులగొట్టారు. ప్రయాణికుల సిమెంట్ బెంచీలను డ్యామేజీ చేశారు.


భయం భయమే..



మా తండా పక్కకే నాచారం రైలుస్టేషన్ ఉంది. కూరగాయలు అమ్ముకునేందుకు రైలులోనే పట్నం పోతాం. ఇక్కడ ఏం మంచిగలేదు. రోడ్డు బాగాలేదు. లైట్లు వెలుగవు. చీకటిపడితే అంతా భయమే.. పట్నం పోయెటపుడే రైలు ఎక్కుతాం. వచ్చేటపుడు బస్సులోనే వస్తాం.

– కోల అనిత-నర్సింహులు దంపతులు, నర్సంపల్లి తండా

సౌకర్యవంతంగా మార్చాలి



నాచారం రైల్వేస్టేషన్ ఏర్పాటుతో గుట్టకు వచ్చే యాత్రికులకు రైలు సౌకర్యం సమకూరినట్లయింది. కానీ స్టేషన్ నుంచి క్షేత్రానికి వచ్చేందుకు సరైన రోడ్డు, రవాణా సదుపాయం లేదు. దీంతో యాత్రికులు బస్సు ప్రయాణానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. నాచారం స్టేషన్ వద్ద సౌకర్యాలు మెరుగుపరిస్తే అందరికీ మేలు చేకూరుతుంది.

– అన్నపూర్ణ, ఈఓ, నాచారం గుట్ట

క్లుప్తంగా

అనారోగ్యంతో చంద్రకాంతశర్మ కన్నుమూత

నాలుగు దశాబ్దాలపాటు నాచగిరిపై తనదైన ముద్ర



చంద్రకాంతశర్మ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం నాచారం గుట్ట శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం రిటైర్డ్ వేదపండితులు జ్యోషి చంద్రకాంతశర్మ(72) గురువారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. నాచారం గుట్ట దేవస్థాన వేదపండితునిగా 1976లో ఆయన నియమితులై 2018లో పదవీ విరమణ పొందారు. వేదం..చంద్రకాంతం అన్నట్లు నాలుగు దశాబ్దాలపాటు వేదఘోషతో నాచగిరిపై తనదైన ముద్రవేశారు. నాచగిరీశుని సేవలో తరిస్తూనే అక్కడి మల్లినాథసూరి వేదపాఠశాల ద్వారా అనేక మంది విద్యార్థులకు వేద విద్య నేర్పించారు. రాష్ట్ర ఉత్తమ వేదపండితుడిగా, జిల్లా ఉత్తమ వేద పండితుడిగా అనేక అవార్డులు సొంతం చేసుకున్నారు. ఆయన మృతిపై ఆలయ ఈఓ అన్నపూర్ణ, ఆలయ సిబ్బంది, అర్చకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు చంద్రకాంతశర్మకు భార్య గిరిజ, కూతురు వెంకటలక్ష్మి, అల్లుడు శశిధర్‌శర్మ ఉన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం అంత్యక్రియలు జరిగాయి.

అటవీ భూమి చదును



భూమిని పరిశీలిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): అటవీ భూమిని రెండు రోజులుగా చదును చేస్తూ కబ్జాకు పాల్పడుతున్న ఘటన మండల పరిధి పూర్వ కొత్తపేట పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. కొత్తపేట అటవీ కంపార్ట్‌మెంట్ 53లో పలువురు గిరిజనులు రాత్రివేళల్లో అటవీ భూమిని చదును చేసి దున్నకం చేపట్టారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు ఆ భూమిని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట్‌రావుపేట సెక్షన్ ఆఫీసర్ కరిమొద్దీన్ మాట్లాడుతూ.. కొత్తపేట కంపార్ట్‌మెంట్ పరిధిలో పలువురు గిరిజనలు రాత్రివేళల్లో చదును చేసి దున్నకం చేపట్టారని తెలిపారు. కబ్జాలకు పాల్పడిన జర్పుల తుకారం, రాజు, నెహ్రూలపై కేసులు నమోదు చేశామన్నారు.

పెళ్లి భయంతో..

పురుగు మందు తాగి యువతి ఆత్మహత్య

చేర్యాల(సిద్దిపేట): పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఆకునూరులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పుప్పాల వెంకటేశ్వర్లు చిన్న కూతురు మహేశ్వరి(25)కి ఇటీవల పెళ్లి సంబంధం చూశాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకి పాల్పడింది. గమనించిన పొరుగు వారు విషయం తండ్రికి తెలిపారు. వెంటనే ఇంటికెళ్లిన తండ్రి బంధువుల సాయంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పెళ్లి అంటే భయంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

రోగి చనిపోయినా చికిత్స చేశారు

- కుటుంబ సభ్యుల ఆందోళన
- గచ్చిబౌలి కేర్ ఆస్పత్రిలో నర్సాపూర్ వాసి మృతి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో శుక్రవారం ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. బాధితుల కథనం మేరకు.. మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణానికి చెందిన వెంకటేశ్ అనారోగ్య కారణాలతో కొద్ది రోజుల కిందట గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో చేరారు. ఇప్పటి వరకు వైద్య ఖర్చుల కోసం రూ.5 లక్షల రోగి బంధువులు చెల్లించారు. తెల్లవారుజాము వరకు ఆరోగ్యంగా ఉన్న వెంకటేశ్ ఆకస్మాత్తుగా మృతి చెందాడు. అయినా రోగికి ట్రీట్‌మెంట్ చేశారని, అతడు బతకాలంటే రూ.4 లక్షలు చెల్లించాలని ఆస్పత్రి యాజమాన్యం డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. అనుమానంతో ఆస్పత్రి ఐసీయూ అద్దాలు పగులగొట్టి చూడగా అప్పటికే వెంకటేశ్ మృతి చెంది కనిపించాడు. దీంతో కోపోద్రికులైన కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. బాధితులను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శించారు.



చేప పిల్లల పంపిణీ పథకం ఈ ఏడాది ఆలస్యమేలా కనిపిస్తోంది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో బిడ్లకు సంబంధించి టెండరు బాక్స్‌లు తెరవగా ఒక్కరు కూడా టెండర్‌లో పాల్గొనకపోవడంతో అధికారులు అవాక్కయ్యారు. ఈ నెలలోనే చెరువుల్లో చేప పిల్లలు వదిలేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందుకు సంబంధించి విధివిధానాలు ఖరారు చేశారు. కానీ గుత్తేదారులు బిడ్ దాఖలు చేయలేదు. ఈ క్రమంలో టెండర్ గడువును 13వ తేదీ వరకు పొడిగించి మరోసారి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. జీరో టెండర్ కావడంపై అధికారులు సైతం చర్చించుకుంటున్నారు.

-వట్‌పల్లి(అందోల్)

చేప.. చెరువుకు చేరేనా?

- పిల్లల పంపిణీకి జీరో టెండర్లు!
- నిన్నటితో ముగిసిన గడువు.. ముందుకు రాని కాంట్రాక్టర్లు
- జిల్లాలోని చెరువులు 1,160, లక్ష్యం 3.41 కోట్లు
- మరోసారి గడువు పెంచిన అధికారులు
- నాణ్యతాలోపం, బిల్లుల చెల్లింపులో ఆలస్యమే కారణమా?

జిల్లాలో మొత్తం 1,160 చెరువులు, కుంటలు ఉన్నాయి. 227 మత్స్య సహకార సంఘాలు ఉండగా వీటిలో 11,013 మంది సభ్యులు ఉన్నారు. ఈ ఏడాది 3.41 కోట్ల చేప పిల్లలు వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ అధికారులు ఎంచుకున్న లక్ష్యానికి చెరువుల్లో వదులుతున్న దానికి ఏ మాత్రం పొంతన కుదరడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. నిర్ణయించిన లక్ష్యంలో వంద శాతం చేప పిల్లలను వదులుతున్నట్లు ప్రకటనలు ఇస్తున్నా అదంతా ఉత్తదేనని మత్స్యకారులు అంటున్నారు. కేవలం 60 నుంచి 70 శాతం వరకే చేప పిల్లలు వదిలిమమ అని పించుకుంటున్నారు.

సైజు తక్కువగా ఉండటంతో..

జిల్లాలోని చెరువుల్లో ఈసారి బంగారు తీగ, కట్లా, మ్రిగాల, రోగు అనే రకాల చేప పిల్లలను వదలాలని నిర్ణయించారు. అయితే చేప పిల్లల్లో నాణ్యత ఉండడం లేదన్న ఆరోపణలున్నాయి. అధికారులు చెరువుల వద్దకు చేప పిల్లలను తీసుకొచ్చే సమయంలోనే చాలా వరకు చనిపోయి ఉంటున్నాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. చేప పిల్లల్లో నాణ్యత లోపించడంతో సైజు పెరగడం లేదంటున్నారు. సాధారణంగా పిల్లలను చెరువుల్లో వదిలే సమయంలో 82 ఎంఎం, 35 ఎంఎం నుంచి 40 ఎంఎం వరకు ఉండాల్సి ఉండగా అంతకు తక్కువగా ఉంటున్నాయన్నారు. కొన్ని చోట్ల సైజు తక్కువగా ఉందని వెనక్కి పంపిన సందర్భాలు ఉన్నాయి. నాసిరకం చేప పిల్లలను చెరువుల్లో వదిలితే వాటి ఎదుగుదల ఉండదని మత్స్యకారులు వాపోతున్నారు. చాలా చిన్న పిల్లలు కావడంతో లెక్కల్లో కూడా తేడా వస్తోందని చెప్పారు. లక్ష పిల్లల వదిలామని అధికారులు చెబుతున్నా 70 నుంచి 80 వేలు కూడా ఉండటం లేదని వాపోతున్నారు. ఈ సారైనా అధికారులు నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

బకాయిలు చెల్లించకపోవడమే కారణమా?

ప్రభుత్వం జిల్లాలోని చెరువుల్లో చేప పిల్లలకు సంబంధించి పది రోజుల కిందట బిడ్లు వేయడానికి అవకాశం కల్పిస్తూ ప్రకటన చేసినా 2వ తేదీ వరకు ఒక్క టెండరు కూడా రాకపోవడానికి కారణాలను అధికారులు వెతుకుతున్నారు. ముఖ్యంగా గతేడాది ప్రభుత్వానికి సరఫరా చేసిన చేప పిల్లలకు సంబంధించి బిల్లులు ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో ముందుకు రాలేదని తెలుస్తుంది. రాజమండ్రి, కై కలూరు ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టర్లు మాత్రమే ఈ ప్రాంతంలో చాలా కాలంగా టెండర్లలో పాల్గొంటున్నారు. అధికారులు మరోసారి టెండర్ గడువును 13వ తేదీ వరకు పొడిగించారు.

> **టెండర్ వేయడానికి ముందుకు రావాలి**
>
> జిల్లాకు చేప పిల్లలను పంపిణీ చేసేందుకు గత నెలలో బిడ్లకు ఆహ్వానించినా చివరి వరకు ఒక్కటీ కూడా రాలేదు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకుపోగా ఈనెల 13వ తేదీ వరకు మరోసారి బిడ్లు వేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. బిడ్‌లో పాల్గొనే వారు నిర్ణయించిన తేదీల్లో టెండర్లలో పాల్గొనాలి. జిల్లాలో చేపపిల్లల పంపిణీకి 3.41 కోట్లు టార్గెట్ నిర్ణయించాం. జిల్లాలో మొత్తం చెరువులు, కుంటలు 1,160 ఉన్నాయి.
>
> – సుధాకర్, మత్స్యశాఖ ఏడీ, సంగారెడ్డి

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ వెంకటయ్య



స్కిల్ ప్రోగ్రామ్ ముగింపులో వెంకటయ్య, తదితరులు

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్కిల్ ప్రోగ్రామ్ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. కబడ్డీ, వ్యాసరచన, సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతోపాటు, విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో పని చేస్తున్న ఎర్త్ ఫౌండేషన్‌ను అభినందించాల్సిన విషయమన్నారు. విద్యార్థుల ఆలోచనలు తప్పుదోవ పట్టకుండా పుస్తక పఠనంతోపాటు ప్రత్యేక మోటివేషన్ తరగతులను నిర్వహించాలని టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌ఓ భాస్కర్, ఎర్త్ ఫౌండేషన్ అధ్యక్షుడు పెద్ది ప్రమోద్, డైరెక్టర్ వెన్నెల, స్కిల్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఆంజనేయులు, రాజు, టీం సభ్యులు నాగలక్ష్మి, హిమబిందు, సురేశ్, భార్గవి, ప్రశాంత్, స్వామి, నిహారిక, కౌశిక్, ఇమ్రాన్, పాఠశాల టీచర్లు పాల్గొన్నారు.

అక్కాతమ్ముడు అదృశ్యం

టేక్మాల్(మెదక్): అక్కా తమ్ముడు అదృశ్యమైన ఘటన టేక్మాల్ మండలంలోని ఎల్లుపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ తుక్కయ్య కథనం మేరకు.. ఎల్లుపేట గ్రామానికి చెందిన మూడ రాములు ఐదు నెలల కిందట మృతి చెందగా.. భార్య పదేళ్ల కిందట మృతి చెందింది. వీరి పిల్లలు మూడ శ్రీలత(18), శివప్రసాద్(12) పెద్దనాన్న నర్సింలు ఇంటి వద్దే ఉంటూ చదువుకుంటున్నారు. రోజు మాదిరిగానే ఒకటో తేదీన ఉదయాన్నే వ్యవసాయ పనులకు వెళ్లిన నర్సింలు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఇంటికొచ్చాడు. ఇంటి వద్ద శ్రీలత, శివప్రసాద్ కనిపించలేదు. వారి వద్ద ఉన్న నంబర్లకు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. గ్రామ చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఇంట్లో ఉన్న సమయంలో శ్రీలత ఎరుపు రంగు పంజాబీ డ్రెస్, శివ ప్రసాద్ ప్యాంటు, షర్టు ధరించి ఉన్నట్లు తెలిపారు. నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఇంటి నుంచి బయటికి వెళ్లి వ్యక్తి..

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. హద్నూర్ పోలీసుల కథనం మేరకు.. మల్గి గ్రామానికి చెందిన మొల్లవాలే చాంద్ పాష(38) గత నెల 26న పని నిమిత్తం బీదర్‌కు వెళ్లాడు. రాత్రి గడిచినా ఇంటికి తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మానసిక వ్యాధితో బాధపడుతున్న పాష గతంలోనూ ఇంటి నుంచి వెళ్లి వారం రోజులకు తిరిగి వచ్చాడని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. చాంద్‌పాష మెరూన్ కలర్ షర్టు, నల్లరంగు ప్యాంటు కలిగి ఉన్నాడని, బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గుండెపోటుతో భూ నిర్వాసితుడు మృతి

నర్సాపూర్ రూరల్: గుండెపోటుతో భూ నిర్వాసితుడు మృతి చెందిన ఘటన నర్సాపూర్ మండలం చిన్న చింతకుంటలో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం మేరకు..గ్రామానికి చెందిన వంటేరు రాంరెడ్డి (62)కి ఉన్న రెండు ఎకరాల భూమి కొండపోచమ్మ నుంచి సంగారెడ్డికి వెళ్లే రీచ్ టు కాల్వకు ప్రభుత్వం తీసుకుంటుందని కొద్ది రోజుల కిందట అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి నుంచి బెంగతో ఉంటూ అనారోగ్యానికి గురవుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కాల్వ కోసం భూములు ఇవ్వమని 22 రోజులుగా చింతకుంట గ్రామస్తులు రిలే దీక్షలు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో బెంగ పెట్టుకొని గుండెపోటుతో మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవడంతోపాటు నష్ట పరిహారం మొత్తం చెల్లించాలని డిమాండ్ చేస్తూ నర్సాపూర్–మెదక్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. పోలీసులు రాస్తారోకోను విరమింపజేశారు.

బైక్ టైర్‌లో చున్నీ చుట్టుకొని మహిళ..

పటాన్‌చెరు టౌన్: బైక్‌పై నుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన అక్తరి బేగం భర్త ఖుర్షిత్ శుక్రవారం హైదరాబాద్ వైపు నుంచి పాపన్నపేట వైపు వెళ్తున్నారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి ఓఆర్ఆర్ సమీపంలోకి రాగానే బైక్ వెనుకాల కూర్చున్న అక్తరి బేగం(50) మెడలో ఉన్న చున్నీ బైకు వెనుక టైర్‌లో పడింది. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడటంతో బేగంకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతురాలి కూతురు అస్రా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

హైనా దాడిలో దూడ..

చేగుంట(తూప్రాన్): హైనా దాడిలో దూడ మృతి చెందిన ఘటన మండలంలోని ఇబ్రహీంపూర్ శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు, రైతుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గడ్డ చంద్రం తన పశువులను వ్యవసాయ పొలం వద్ద కట్టేశాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని జంతువు దూడను చంపేసింది. శుక్రవారం సమీప పొలాల రైతులు దూడ చనిపోవడం గుర్తించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. దూడను హైనా చంపి తిని ఉంటుందని గ్రామ రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

రూ.66.75 లక్షలు పోగొట్టుకున్న వైనం

పటాన్‌చెరు టౌన్: నకిలీ స్టాక్ మార్కెట్ పేరిట ప్రైవేట్ ఉద్యోగికి బురిడీ కొట్టి భారీగా నగదు కాజేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీకి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి జూన్ 18 వ తేదీన వాట్సాప్ ద్వారా స్టాక్ మార్కెట్ కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. బాధితుడు తన వివరాలను నమోదు చేశారు. అపరిచిత స్టాక్ మార్కెట్ నిర్వాహకులు ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. అతడు నగదును ఆన్‌లైన్‌లో పెట్టుబడి చేస్తూ వచ్చాడు. మొత్తం రూ.66.75 లక్షలు పెట్టుబడి పెట్టాడు. బాధితుడు చివరగా తాను పెట్టిన నగదుతోపాటు లాభాలు ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరోచోట రూ.15 లక్షలు

తూప్రాన్: ఓ ఉద్యోగి నుంచి సైబర్ నేరగాళ్లు నగదు కాజేసిన ఘటన పట్టణంలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. పట్టణంలోని 12 వార్డులో నివాసం ఉంటున్న ఓ ప్రైవేట్ ఉద్యోగి ఇన్‌స్టాగామ్‌లో ట్రేడింగ్ కోసం వెతికాడు. ఓ లింక్ ఆధారంగా ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ వాట్సాప్ గ్రూపులో సైబర్ నేరగాళ్లు సదరు వ్యక్తిని చేర్చారు. ఐఐఎఫ్ఎల్ ప్రో అనే యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న వ్యక్తి ట్రేడింగ్ విషయంలో పలు దఫాలుగా రూ.15 లక్షల వరకు చెల్లించాడు. అనంతరం జులై 5న తన ఐడీబీఐ బ్యాంకు ఖాతాలో రూ.5.10 లక్షలు జమయ్యాయి. ఆ డబ్బులను నేరగాళ్లు మళ్లీ ట్రేడింగ్‌లో పెట్టమని సూచించడంతో సదరు వ్యక్తి వారి మాటలు నమ్మి పెట్టాడు. అనంతరం ఐఐఎఫ్ఎల్ ప్రో యాప్‌లో రూ.95 లక్షలు చూపిస్తున్నప్పటికీ విత్‌డ్రా చేసుకునేందుకు రావడం లేదు. ఆ సంస్థ కస్టమర్ కేర్ నంబర్‌ను సంప్రదించగా రూ.4 లక్షలు చెల్లిస్తే విత్‌డ్రా చేసుకునే అవకాశం వస్తుందని నమ్మబలికారు. వెంటనే బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫామ్‌హౌస్ అడ్డాగా పేకాట

- దాడి చేసిన ములుగు పోలీసులు
- 11 మందిపై కేసు నమోదు
- రూ.67,920 నగదుతోపాటు బైక్‌లు, కార్లు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

ములుగు(గజ్వేల్): పేకాట శిబిరంపై ములుగు పోలీసులు దాడి చేశారు. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన 9 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఈ ఘటన గురువారం రాత్రి ములుగు మండలం క్షీరసాగర్‌లో చోటు చేసుకుంది. ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. క్షీరసాగర్ గ్రామ శివారులోని ఫామ్‌హౌస్ అడ్డాగా పేకాట స్థావరం నిర్వహిస్తున్నారు. కొంత మంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందగా ములుగు ఎస్ఐ విజయ్ కుమార్ సిబ్బందితో కలిసి వెళ్లి పేకాట స్థావరంపై దాడి చేశారు. హైదరాబాద్‌లోని బోయినిపల్లికి చెందిన మామిడి మహేందర్‌రెడ్డి, మునుగుల వినయ్, పెండల యాదగిరి, కొండం రాజేంద్రప్రసాద్ (బషీర్‌బాగ్), కాశీపాక నారాయణ(నాంపల్లి), చిత్తారు సురేశ్‌కుమార్(కూకట్‌పల్లి), బత్తుల శివ దుర్గాప్రసాద్ (కాప్రా ఈసీఎల్), నెల్లపాల నరేశ్(వనస్థలిపురం), పింక రాజేందర్ (దమ్మాయిగూడ, ఈసీఎల్)లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.67,920 నగదుతోపాటు 10 సెల్ ఫోన్లు, 4 బైక్‌లు, 3 కార్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పేకాట నిర్వహిస్తున్న క్షీరసాగర్‌కు చెందిన బొడ్డు నర్సింలు, బోయినిపల్లికి చెందిన గద్దం ప్రవీణ్‌యాదవ్‌లపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఏడుగురు అరెస్ట్

కల్హేర్(నారాయణఖేడ్): పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అరెస్ట్ చేసినట్లు సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. సిర్గాపూర్ మండలం బొక్కస్‌గాంలో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు గ్రామానికి చెందిన ఊపాసే వైజ్యానాథ్ ఇంట్లో పేకాట ఆడుతుండగా దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నాం. వారి వద్ద నుంచి రూ.5,420 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

11 మందిపై కేసు నమోదు

సిద్దిపేటకమాన్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు కథనం మేరకు.. పట్టణంలోని శ్రీనగర్ కాలనీలోని ఓ ఇంట్లో అక్రమంగా పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం వచ్చింది. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, వన్ టౌన్ పోలీసులు శుక్రవారం పేకాట స్థావరంపై దాడి పట్టణానికి చెందిన 11 మంది శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, మైసారెడ్డి, సురేందర్‌రెడ్డి, విశ్వనాథం, గంగాప్రసాద్, మహేశ్, రామాచారి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రాజిరెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.15,580 నగదుతోపాటు 9 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

నారాయణఖేడ్: చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. తుర్కాపల్లి గ్రామానికి చెందిన కుర్మ అంజిగౌండ గత నెల 30న ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో కలిసి పొలానికి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో బీరువా తాళాలు పగులగొట్టి బంగారు, వెండి నగలను చోరీ చేశాడు. మన్సూర్‌పూర్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా తుర్కపల్లికి చెందిన గోవిందు మాణిక్యం పోలీసులను చూసి ఆటో దిగి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. విచారణలో అంజిరెడ్డి ఇంట్లో చోరీ చేసింది తానేనని ఒప్పుకున్నాడు. అతడి నుంచి 2.6 గ్రాముల బంగారం, 31.8 గ్రాముల వెండి నగలను స్వాధీనం చేసుకున్నారు. అక్టోబరులో ఖేడ్‌లో ముత్తూట్ ఫైనాన్స్‌లో చోరీకి యత్నించిన కేసులోనూ గోవిందు మాణిక్యం నిందితుడిగా ఉన్నాడు. మద్యం తాగడం, జూదమాడటం జల్సాలకు బానిసై ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ సులువుగా డబ్బులు సంపాదించాలనే చోరీ చేశాడని ఎస్ఐ వివరించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచామన్నారు.

విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించండి

డీఎంహెచ్ఓకు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాలు

మెదక్‌జోన్: మెదక్‌లోని కేజీబీవీలో ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థిని జ్వరంతో మంచం పట్టింది. మందులు వాడినా తగ్గకపోవడంతో శుక్రవారం మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. హవేళిఘనపూర్ మండలం రాజిపేటకు చెందిన స్వామి కూతురు మానస పట్టణంలోని కేజీబీవీలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. గత నెల 31న కళాశాలలో జ్వరం, దగ్గుతో బాధపడుతుండగా మందులు ఇచ్చినట్లు సిబ్బంది తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా వారు గ్రామానికి తీసుకెళ్లి ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించారు. అయినా తగ్గకపోవడంతో శుక్రవారం మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యార్థినికి సరైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. డీఈఓ, ఎంఈఓలు ఆస్పత్రికి వెళ్లి మానసను హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

- 15 మంది నుంచి రూ.8.45 లక్షలు వసూలు
- నిందితుడి అరెస్ట్



నిందితుడు ప్రవీణ్

కామారెడ్డి క్రైం: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డిలోని అశోక్‌నగర్ కాలనీలో నివాసం ఉండే చిలుక నవీన్ ఎంఎస్ఎన్ కంపెనీలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అదే కంపెనీలో పని చేస్తున్న సుంచు ప్రవీణ్ తనకు తెలిసిన వారు చాలా మంది ఉన్నారని, ప్రభుత్వ విభాగాల్లో ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగం ఇప్పిస్తానని నవీన్‌ను నమ్మించాడు. నవీన్, అతడి భార్య జ్యోతితో పాటు వారి స్నేహితులు, బంధువులు మొత్తం 15 మంది నుంచి ప్రవీణ్ మొత్తం రూ.8.45 లక్షలు వసూలు చేశాడు. అనంతరం వారికి నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్‌లు అంటగట్టాడు. మోసపోయామని గ్రహించి జ్యోతి పట్టణ పోలీసులకు గత నెల 22న ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు నిందితుడు ప్రవీణ్‌ను మెదక్ జిల్లా నిజాంపేట మండలం బచ్చురాజులపల్లి వాసిగా గుర్తించారు. ప్రస్తుతం అతడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. విలాసాలకు అలవాటు పడి తేలికగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశ్యంతో ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడు ప్రవీణ్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

పేద కుటుంబానికి పెద్ద ఆపద

- రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు
- చికిత్స కోసం రూ.20 లక్షలు ఖర్చు
- ఆపన్నహస్తం కోసం కుటుంబీకుల ఎదురుచూపు



కుమారుడి వద్ద రోదిస్తున్న తల్లి సుమిత్ర

దుబ్బాకటౌన్: విధి ఆడిన వింత నాటకంలో ఓ పేద బార్బర్ కుటుంబం చిన్నాభిన్నమైంది. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి పుట్టెడు కష్టం వచ్చింది. దినదినగండంగా దయనీయ పరిస్థితుల్లో ఆస్పత్రిలో రోజులు గడుపుతున్నారు. కుటుంబానికి పెద్ద దిక్కు అయిన తండ్రి మరణించడంతో కుటుంబ భారాన్ని తన భుజాలపై వేసుకున్న 22 ఏళ్ల కుమారుడు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చు అవుతుండటంతో ఆ నిరుపేద కుటుంబం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది.

బార్బర్‌గా పని చేస్తూ..

దుబ్బాక పట్టణానికి చెందిన రాసమల్లు రమేశ్, సుమిత్ర దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు మణికంఠ ఉన్నాడు. పెద్ద కుమార్తెకు నాలుగేళ్ల కిందటే వివాహం చేశారు. చిన్ని కుమార్తె టైలరింగ్ చేస్తోంది. కుటుంబ పెద్ద దిక్కైన తండ్రి మరణించడంతో కుటుంబ భారం మణికంఠ పై పడింది. సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లోనే ఉంటున్నారు. మణికంఠ దుబ్బాక పట్టణంలో బార్బర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇంతలోనే రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. రాజన్న సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రానికి పని నిమిత్తం వెళ్లిన మణికంఠ ముస్తాబాద్‌లో బైక్ అదుపుతప్పి కింద పడటంతో తలకు, చెవికి, మెడకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స కోసం హైదరాబాద్‌లో కిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు తమకు తోచినంత డబ్బులు ఇవ్వడంతో మణికంఠ చికిత్స పొందుతున్నాడు.

> **సాయం చేయాలనుకునే వారు**
>
> బ్యాంక్ వివరాలు
>
> పేరు: రాచమల్లు మణికంఠ
>
> అకౌంట్ నంబర్: 22311201000239
>
> ఐఎఫ్ఎస్‌సీ కోడ్: యూబీఐఎన్0822311
>
> ఫోన్ పే, గూగుల్ పే: 99660 36214



మణికంఠ

ఆపరేషన్‌కు రూ.20 లక్షలు

మణికంఠకు ఆపరేషన్ చేయడానికి రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టరు చెప్పారు. తమ వద్ద ఉన్న డబ్బులు మొత్తం కూడబెట్టినా ఆస్పత్రి మందులకు సరిపోవడం లేదని వాపోతున్నారు. మాయందు దయ తలచి దాతలు ఆర్థిక సాయం చేయాలని తల్లి సుమిత్ర కోరుతున్నారు.